"సా రో" -- పిలుపువిని తలతిప్పి చూశాడు రాఘవయ్య.

స్టెనోగ్రాఫర్ శైలజ; గేటుదగ్గర కాగితాలు పట్టుకుని నుంచుంది.

చటుక్కున చేతిలోపార అక్కడ పడేసి తువాలు భుజంనిండా కప్పుకొని నిలబడ్డాడు రాఘవయ్య.

"అప్పుడే ఫినిష్ చేసేశావా? వండర్‌ఫుల్! ... ... ఇంతవేగం వస్తావను కోలేదు-" రేపు హైదరాబాదు చేరవలసిన రిపోర్టు. స్టేట్‌మెంట్లన్నీ కూలంకషంగా పరిశీలించి చూస్తే తప్పా డిక్టేషన్ ఇవ్వలేక పోయాడు. ఈఉదయమే క్యాంపునుంచి రావడం; పగలంతా విరామం లేకుండా పని. సంతకాలే. అయితేనేం; చదకుండా పెట్టేవికాదుగా. ఒక్కొక్క సంతకం వెనకాల ఒక్కొక్క బాధ్యత. అలా అప్పుడో పేజీ అప్పుడో పేరా డిక్టేట్ చేసేసరికి సాయంకాలం ఐదయిపోయింది. "టైపుచేసి మాఇంటికి జీపులో తీసుకొచ్చేయమ్మా. ఈలోపుని ఇంటికెళ్ళి కొంచెం స్నానం చేస్తాను. కాయితాలు నేను చూసేక ఆజీపులోనే అలా ఇంటికెళిపోదుగాని?" అని చెప్తే శైలజ నిస్సహాయంగా తలాడించింది.

"సారీ." అన్నాడులుంగీ, తువాలు - తనవేషం చూసుకొని

వీధి వరండాలో శైలజను కూర్చోపెట్టి లోపలికెళ్ళి చేతులు శుభ్రంగా కడుక్కొని, తుడుచుకొని పెన్‌చేత్తో పట్టుకొచ్చాడు. రిపోర్టు చూశాడు.

"టైపింగ్ చాలా బాగా చేసేవమ్మా థాంక్యూ."

"థాంక్సార్." తన సర్వీసు నాలుగేళ్ల మొత్తంలో ఒక్క ఆఫీసరు అననిమాట, అనిపించని మాట, ఆచిన్నమాట థాంక్స్.

"రాములూ రెండు కప్పుల్లో పోసి కాఫీ తీసుకురా." రఘువయ్య లోపలికి చూసి కేక పెట్టాడు.

"న - న్న - న్నాకొద్దుసార్ ...."




"మజ్జానం మూడు గంటల్నుంచి రెస్ట్‌లేకుండా పన్జేస్తున్నావు. కొంచెం కాఫీయేగా. పర్వాలేదు --"

"అదికాదుసార్. కొన్నాళ్లపాటు కాఫీ తాగొద్దన్నారుసార్ మాఅత్తగారు....."

"ఓ, ఐమ్ సారీ. బాలింతరాలివి కదు; మర్చేపోయాను." మళ్లా ఇంట్లోకి చూసి "రాములూ పొయిమీద పాలు మరిగించి మూతపెట్టున్నాయి. గ్లాసులోపోసి పట్రా. నాకేమో కాఫీ కలుపు. పంచదార సీసా చెమ్చా మర్చిపోకు -' అని వివరంగా చెప్పాడు.

"ఎందుకుసార్ తమరికి అనవసరం శ్రమ-" అంటూనే కుర్చీలో ఒదిగి కూర్చుంది శైలజ.

రాఘవయ్య మాటాడలేదు. మడిచిపెట్టిన కాగితాలు మరోమాటు విప్పి ఏదో సందేహం నివృత్తి చేసుకొని మళ్లామూసి మడతపెట్టాడు.

"మీకు గార్డెనింగ్ హాబీ, సార్?"

"ఏదో కాలక్షేపం, వ్యాయామం న్నూ"

"ఏం వ్యాయామం సార్. కష్టం కాదా ... ... "

రాములు వొచ్చేడు.

"మన ఆఫీస్ స్వీపరు రంగయ్య మట్టిపనిలో ఆరితేరిన వాడుకదా. వాణ్ణి రమ్మంటే పోను -"

"తీస్కోమ్మ. ఇంకా వేడిగా కావాలంటే తెస్తాడు-కాని నువ్వు మరీ అంత వేడిగా ఉండేవి మరీ అంతచల్లగా ఉండేవి తీస్కోగూడదు."

"మాఅత్తగారు కూడా అలాగే అంటారు సార్."

"రాములూ, డ్రయివర్ అక్కడ నిలబడి వెళ్ళిపోమంటారా అన్నట్టు చూస్తున్నాడు. ఈపిల్లని వాళ్లింటి దగ్గర దింపాలని చెప్పు."

రాములు వెళ్లబోయాడు.

# సంపెంగ పూసింది



రాఘవయ్య వెనక్కి వాల్చి వి(...)ు చెప్పేడు. "ఈమెని వాళ్ళింటిదగ్గర డ్రాప్‌చేసి క్రిష్ణమూర్తిని తీసుకొని రైల్వే ..ఎన్. గారి బంగళాకి వెళ్లమను. ఆయన చేత స్టేషన్‌కి ఫోన్‌చేయించి కోజార్కకి అ(...)న టికెట్టు ఒకే చేయించుకోమను."

"ఎస్సార్ -"

"ఏంటన్నావ్? రంగం(...)ా? వాడిది మళ్లీ "పవి" కాదు మట్టి బుర్ర." - చూడమ్మా! ఆసంపెగ చెట్టుకి (...)ుదేళ్లనించి పూతలేదట. ఇంటావిడ చెప్పి(...)ది. చెట్టు ఎండిపోకుండా మాత్రం చూడం(...) బాబూ అని కళ్లనీళ్లు పెట్టుకుని చెప్పింది. నేనిఇంట్లో దిగేనరికి నేలంతా యెండిపో(...)న పాదుల తీగల్లో రాళ్లు రప్పల్లో నా(...) కంగాళీగా ఉండేది. నాచేతుల్తో నేనే (...)న్ చేసేను. ఆనాతిలో నీళ్ల ఐ(...)ారేళ్లబట్టి తోడనేలేదట.... మాయదారి కొళాయిలు వెళ్ళి వచ్చాయి." కాఫీకప్పు (...)ంద పెట్టేడు రాఘవయ్య. "ఆ సంపెంగ చె(...)ట్టుకి రోజుకి ఓపాతిక బకెట్ల చొప్పున ఇప్పటి(...)ి నాచేతుల్తో నేను ఓ వెయ్యి బకెట్ల నీళ్ళు (...)సుంటాను. ఆకుదురు చూసేవా! అరడుగు (...)కైవారంలో అడుగులోతుకి నాచేత్తో నే(...) చేసేను. ఆసంపెంగ చెట్టుకి నాచేతులవి(...)సుగా పూత రావాలి అదీ. నాపట్టుదల -"

ఆమాటల్లో ఆత్మీయ(...) శైలజని ఎక్కడికో తీసుకుపోయింది.

"సార్?" అంది ఏదో (...)ంనవి చేసే ధోరణిలో ఉన్నా కళ్లు మిలమిల(...)డించింది.

"చెప్పమ్మా!"

"మీ అమ్మాయి -"

ఒక్కసారిగా బిగుసు(...)పోయాడు రాఘవయ్య "వాట్ డుయు మీన్, మా అమ్మాయి!"

"అదే సార్... (...)అమ్మాయి రత్నం-" బంకుతూనే చెప్పి(...)ది శైలజ- "ఈవూళ్లోనే ఉన్నాదిసార్. పో(...)స్టల్లో స్టెనోగా పనిచేస్తోంది... అతనేమో (...)టోరియల్ కాలేజీలో లెక్చరర్‌గా జాబ్ చేస్తున్నాడండి. డాబా గార్డెన్స్‌లో ఇన్‌కంటాక్సు ఆఫీసు కెదురుగా ఓ చిన్నగది వరండా ఉన్న ఇంట్లో ఉన్నారండీ... రత్నం నా బెస్టుఫ్రెండు సార్. తమర్ని తల్చుకొని బాధపడుతూ ఉంటుంది సార్. ఒక్కసారి తీసుకు రానాండి!'

"నో!" అని పెద్ద కేక పెట్టాడు రాఘవయ్య. అయినా వెంటనే సర్దుకొని "ఓకే! వచ్చిన పని అయిందిగా వెళ్లిరా."

నిర్ఘాంతపడి నిలబడి నిశ్శబ్దంగా నిలబడి, 'వస్తాను సార్' అని వెళ్లిపోయింది శైలజ.

* * *

తలుపు తీసింది రత్నం.

ఒచ్చిన మనిషెవరో చూసీకూడా

ఆయన్ని లోపలికి రానియ్యాలనీ, అందుకే తలుపు తియ్యడమనీ స్ఫురించనట్టు, తలుపు పట్టుకొని అలా నిలబడిపోయింది రత్నం.

ఆఒక్క క్షణం రాఘవయ్యకి కూడా "పలకరింపు నవ్వు" రాలేదు.

"అల్లుడుగారు లేరా, ఇంట్లో?"

తలుపుమీది చెయ్యితీసి పక్కకి తప్పుకుంది రత్నం ... అల్లుడుట; 'గారు' ట! - అనుకుంది రత్నం. 'లేరు" అన్నట్టు తలూపింది.

ముందుగదిలో రెండు పొడుగాటి బెంచీలున్నాయి. ఒక క్రకుర్చీ.

రాఘవయ్య చొరవగా వెళ్ళి కుర్చీలో కూచున్నాడు. "బావున్నారా?"

దానికి కూడా తలే ఊపింది రత్నం.

ఈ అయిదేళ్లకి "బావున్నారా?" అని; ఆమాటకొస్తే "బతికేవున్నారా" అని పలకరించడం యిదే.....

"నాకీవూరికి ట్రాన్స్ఫరైంది... రెండు నెలలు కావస్తూంది జాయినై. నిన్న సాయంకాలం నాస్టెనోగ్రాఫర్ శైలజ చెప్పింది; మీరీవూళ్లోనే ఉన్నట్టు. నువ్వూ శైలజా క్లాస్‌మేట్స్, ఫ్రెండ్స్ - ఏదో అన్నాది.

శైలజ - మెటర్నిటీ లీవ్‌నుంచి తిరిగొచ్చిందన్నమాట!

చెప్పేసిందన్నమాట!

ఈయన జాయినయ్యేనరికి తను మెటర్నిటీ లీవులో ఉండివుంటుంది. నిన్న చెప్పిందట కదా. నిన్నటి దాకా లీవులోవుండి కడుపులో పెట్టుకున్న గుట్టు -

తనే శైలజకి చెప్పకుండా వుండవలసింది...కాని తప్పిందిగాదు. ఐనా- శైలజకి గట్టిగానే చెప్పింది- 'మానాన్నగారు మీడిపార్టుమెంటులో ఆఫీసరు. మేం ఇలా వచ్చేసినట్టు తెలుసుగాని ఈమాత్రంగా సెటిలయినట్లు తెలీదు. తెలిస్తే సంతోషిస్తారన్న నమ్మకం లేదు. అంచేత చెప్పక్కర్లేదు చెప్పకూడదు కూడాను -" అంటూ.

చెప్పాలనిపిస్తుంది గాబోలు ఇలాటివి! ప్రభాకరం గారన్నట్టు ... ...

ఒక్కరోజైనా ఆగకుండా చెప్పేసుంటుంది.

"కాఫీ ఇస్తానుండు నాన్నా." అని లోపలికి వెళిపోయింది రత్నం.

భమిడిపాటి రామగోపాలం కథ

తను ఈఉద్యోగానికి నాలు ళ్లనాడు పరీక్షకి కూచున్నప్పుడు శైలజ కూడా వుందక్కడ. అమ్మాయిల్లో పోటీ యిద్దరి మధ్యనే. మూడుపోస్టుల్లో ఒకటి మ్మాయి కిస్తారని తెలిసింది. నీకానాకా అన్న ధోరణిలో ఒకర్నొకరు చూసుకొని, నువ్వా నా అని ఈసుతో పోటీచేసేరు. అంతలోనే ల్పంగా స్నేహకాంక్ష. ఒకరి అవకాశాల ఒకరు తెలుసుకొని తద్వారా ఫలితం గాహించే ప్రయత్నం -

"నాకీసంస్థ పెర్సనెల్ ఆఫీసర్‌గారు బాగాతెలుసు." అంది శైలజ.

"నాకెవర్నీ తెలీదు. తె సిందల్లా కొద్దిగాపైవూ పొర్టుహాండూను. అదైనా ప్రభాకరంగారు గట్టిగా కృషిచే యించారు గనకా-"

ఆతరువాత పి.ఒ.గారు ఇద్దర్నీ ఒక్కసారే ఇంటర్వ్యూ గదిలో పిల్చి అన్నిటితోబాటు స్వంత విషయా ు కూడా అడిగేరు. "మీది అసలేవూరు?" - "మీ నాన్నగారెవరు?" - "పెళ్లయిం ా?" - "ఆయనేం చేస్తారు?" - 'పి ా?" - "ఈవూళ్ళో యెక్కడ కాపురం?" అలాగ

"మాది అనలు బొబ్బిలి. మానాన్నగారు రాష్ట్ర ప్రభుత్వంలో ఒక్క ఆఫీసర్. మాఅమ్మగారు నా కెనిమిదేళ్ల వయసున్నప్పుడు యేరు. పధ్నాలుగేళ్లయింది. అబ్బే; మా నాన్నగారు మళ్లీ పెళ్లి చేసుకోలేదు; పైగా బో ెడు నిష్ఠ. నాకు పెళ్లయింది. ఆయనపేరు ప్రభాకరం గారు. ఎమ్మే బీయీడి. ఈవ ళ్లోనే ఒక ప్రయివేటు కంపెనీలో రికార్డు అసిస్టెంటుగా ఉద్యోగం. ఆయనజీతం చాలకనే; నేనీ ఉద్యోగానికి దరఖాస్తు చేసేను. అవును. మాపెళ్లికి మానాన్నగారి ఆమోదం లేదు. ప్రభాకరంగారికి ఏదైనా మంచి ఉద్యోగం వచ్చేదాకా నేనూ ఉద్యోగం చెయ్యాలని ఆలోచన. ఆ. ప్లాన్ లేకేమి? వచ్చే యేడాది రాష్ట్రప్రభుత్వపు క్లాస్ వన్ ఉద్యోగాల పోటీ పరీక్షకి కూర్చుంటారు. దానికోసం ఆయన ఓనాలుగు నెలలపాటు సెలవుపెడతారు. ప్రస్తుతం చెబుతున్న ట్యూషన్లు కూడా మానేస్తారు అప్పుడు మాకు నాసంపాదనే ఆధారం కావచ్చు. అందుకని నాకీ ఉద్యోగం దొరకడం దొరక్కపోడం మీద మాభవిష్యత్తంతా ఆధారపడి ఉంది. లేదండి. నాన్నగారు మమ్మల్ని తన దగ్గరికొచ్చేమనీ కబురు చెయ్యరు. చేసినా ప్రభాకరంగారు ఒప్పుకోరండి, అందుకే ఆయన ఆస్తినీ పలుకుబడినీ వుపయోగించుకోకుండా ఆశించకుండా - దానికేముందండీ; మీరు పెద్దవారు. మంచి చెడ్డా అడుగుతున్నారు. మీరు వివరంగా అడిగేరు. నేను ఫ్రాంక్‌గా చెప్పేను. ఆపైన మీదయ, మా అదృష్టం-"

ఇదంతా చెప్పినప్పుడు శైలజ పక్కనే ఉందికదా

శైలజ చెప్పకపోతే ఈ మహా పట్నంలో ఈవిశాల ప్రపంచంలో ఒక చిన్ని నేనూ, ఒక (ఆయనదృష్టిలో) అల్పుడయిన ప్రభాకరంగారూ యెక్కడున్నామో యెలా తెలుస్తుంది?

"ఏమ్మా!"

స్టవ్‌మీది డికాక్షన్ గిన్నెలోకి వంచుతూ తడబడ్డది రత్నం. కొద్దిగా నేలమీద ఒలికింది, రాఘవయ్య అక్కడ చిన్న చిరిచాప ఉంటేను అది పరుచుకొని గోడకి చేరబడికూచున్నాడు "ఎప్పుడైనా ఒక ఉత్తరం రాశుండొచ్చు కదమ్మా!"

తండ్రికళ్లలోకి చూడ్డానికి భయంగా ఉంది. "సంతంత్రంగా ఆలోచించాలి. స్వేచ్ఛగా బతకాలి. ఎవరి సాయమూ లేకుండా బతికేవాడు ఎవరికీ భయపడక్కర్లేదు. ఎవరికళ్లలో కయినా నిర్భయంగా చూడగలవాడే నిజమైన స్వాతంత్ర్యం కలవాడు"- అని ఆయన చెప్పిన సూత్రం అక్షరాలా పాటించకుండా తనెందుకు భయపడుతోంది?

రెండునెలలు కావస్తోంది. నేనిక్కడ జాయినై - అన్నారు. నిన్న సాయంకాలమే శైలజ చెప్పిందన్నారు- "మా అమ్మాయి. పేరు రత్నం. బి.ఏ. పాసైంది. ఎమ్మే పాసయిన ప్రభాకరం అనే అబ్బాయి నొకణ్ణి రిజిష్టర్డ్ మారేజి చేసుకుంది. వాళ్లు ఈఊళ్లో ఉన్నట్టుగాని నీకేమైనా తెలుసా?" అని నాన్నగారు శైలజని - తన స్టెనోగ్రాఫరే అయినా - అడిగివుంటారనేది అసంభవం.

అడక్కుండానే చెప్పేసి వుంటుంది. 'మీఅమ్మాయి రత్నం నాకు తెలుసు. కులాంతర వివాహం చేసుకుందిగా! వాళ్ల యిల్లు ఫలానా దగ్గిర -" అని వివరంగానే చెప్పేశుంటుంది.


కేవలం ఆయన అభిమానం కోరి - నాన్నగారు నాఉనికిని తెలుసుకోలేక పోవడంవల్ల ఆయనకి ఏదోబాధ ఉంటుందని - ఆబాధకి ఉపశమనం కలిగిస్తే ఉత్తరోత్రా తనకేదైనా బాధో కష్టమో వస్తే ఆయన ఆదుకుంటారని ఆశతో -

"ఇదుగో నాన్నా కాఫీ -" బలవంతంగా చిరునవ్వు తెచ్చుకొని - కూర్చునే ఆయనవేపు తిరిగి గ్లాసు అందిస్తూ అంది రత్నం.

గ్లాసు కుడిచేత్తో అందుకుని అక్కడ పెట్టేశాడు రాఘవయ్య. "ఇలారా, తల్లి."

రత్నం కదల్లేదు.

రాఘవయ్య ముందుకువొంగి, కూతురి భుజంమీద చెయ్యివేసి - "కష్టపడు తున్నావమ్మా. అనవసరం అనీ, ఇంతకంటే



బాగా బతకొచ్చనీ అనిపిస్తుంది నాకు. అదేమో చాదస్తం అని మీకనిపిస్తుంది, ఎలా దీనికి పరిష్కారం?"

"ఏం మునిగిపోయింది; ఎక్కడో ఓ తండ్రికూతుళ్ళ అభిప్రాయాలు కలవక వేర్వేరుగా ఉంటే, ఈ మహాలోకంలో?" అనుకుంది రత్నం.

బుజంమీది చేతిని తలమీదికి తెచ్చేడు రాఘవయ్య. మెల్లిగా తలనిమిరి; "అతన్ని నేనేమైనా అంటే నీకు బాధ. కోపం కూడా కాబోలు. ఒక్క బిడ్డవి నువ్వునాకు. ఒకటే ప్రాణంనాకీ లోకంలో. చిన్నమనసు కష్టపడుతుందని ఎంతమంది మాటలు తోసివుచ్చి నిన్ను పెంచే అవకాశం ఇంకెవ్వరికీ ఇవ్వలేదో నీకు తెలీదా అమ్మా? నీకు బాధ కలిగితే, నువ్వు ఆ బాధని కోపంగా చూపిస్తే, దానికి నాదే తప్పు నువ్వంటే, అదంతా సహించటం అని అనుకోడం అలవాటు చేసుకున్నానే! దానికి నువ్వు నాకింత శిక్షవేస్తావా!"

లొంగదీసేసుకుంటున్నాడు.... ...

"ఎవ్వుడొచ్చావు నాన్నా యీవూరికి?"

ఆ ప్రశ్నతో కళ్ళనీళ్ళ పర్యంతం కావలసిన స్థితి తప్పింది రాఘవయ్యకి. ఈ ట్రాన్సఫరు; తనకి రాజమండ్రి వదిలి రావాలని లేకపోడం, ఇక్కడి మనిషి తనకు రాజమండ్రే కావాలని ప్రయత్నాలుచేసి భూమి, ఆకాశం కదల్చెయ్యడం, ఇక్కడి మేనేజరు ఈపోస్టు తనకే రావాలని వాడుకూడా భూమిని ఎరోవాటు కుదిపెయ్యడం – అన్నీ వివరంగా తేదీలతో పేర్లతో సహా చెప్పేశాడు. దాంతో బేలతనం వొదిలిపోయి బలం వచ్చినట్టయింది అతనికి.

అమ్మపోయి ఇరవయ్యేళ్ళు కావస్తోంది. నేను వచ్చేసి అయిదేళ్ళయిపోయింది. ఒంటరై పోయాడు. ఎవరెవరితోనో ఏమిటేమిటో మాట్లాడుతూనే ఉండుంటాడు. మనసులో మాటలు, నూతిలోంచి తోడి కాలువలో పోసే నీళ్ళలాగ. నన్ను చూసేసరికి ఏదో స్పందన. వానలా, వాగులా; వానలో వాగులా.

"ఇక్కడకొచ్చి నాన్నా, మళ్ళా నీకు వేరే ఇల్లూ అదీ యెందుకు? అంతగా స్థలం సరిపోదనుకుంటే ఇంటివాణ్ణి అడిగి మేడమీది గదులు రెండూ నీకోసం తీసేసుకొంటాను–"

నిజానికి తండ్రికేమీ ముసలితనం ముంచుకొచ్చిడంలేదు. ఎందుకో, అనాలనిపించిందలాగ. ఇదంతా వింటే ప్రభాకరం యేమంటాడో అన్న బెరుకు కూడా ఆక్షణానికి తప్పుకుంది; చిత్రం!

చేతిని ఆమెతలమీంచి బుజం మీదికి, మోచేతిమీదికి తెచ్చేడు రాఘవయ్య. "చదువుకున్నావు. నలుగుర్లో మెసల్తున్నావు. అంచేత ప్రమాణాల మీద జీవన ప్రమాణాల మీద అభిప్రాయాలు మారేయి. లేకపోతే ఈచేతులు ఇలా వుండేవా?"— మణికట్టుమీంచి మోచేతి సగందాకా తడిమి –"ఇక్కణ్ణుంచి ఇక్కడిదాకా ఎనిమిది జతల బంగారపు గాజులుండేవి. అవునా కాదా, తల్లీ! అమ్మని తల్చుకొని నిజం చెప్పూ?"

చెయ్యి లాగేసుకుంది రత్నం. "కాఫీ చల్లారిపోతోంది నాన్నా."

"నువ్వోక గ్లాసు తెచ్చుకో."

"నాకిదిగో, ఉంది కదా!"

"నీకు లేదని నేనన్నానా? నాచేత్తో ఇవ్వాలని నాకుండదూ?" ఆమె చేతిలో గ్లాసు తీసుకొని తనకిచ్చిన గ్లాసులోంచి సగం కాఫీ అందులో పోశాడు." చల్లారలేదు. చల్లారినా ఈ అపేక్ష చల్లారేదికాదమ్మా"

ఆ అపేక్షలోని నిజాయితీని గురించి శోధించసాగింది రత్నం.

సంపెంగ చెట్టు గుర్తొచ్చింది రాఘవయ్యకి. ఆ చెట్టు పూత పుయ్యాలి. ఈ మొగ్గ పువ్వు అవ్వాలి.

కాఫీ తాగుతోందేగాని, రత్నానికి "ఆయనొచ్చేస్తే గొడవైపోతుందేమో!" అని భయం పట్టుకుంది... "రాలేడు!" అని ధైర్యం చెప్పుకుంది, "ఇవాళ అందరికీ సెలవ్ అయినా అతనికి మాత్రం రెట్టింపు పనుంటుంది. ట్యుటోరియల్ కాలేజిలో నిన్న జరిపిన టెస్టు సమాధాన పత్రాలు దిద్దాలి. అక్కణ్ణించి అప్పారావు గారింటికి వెళ్ళి పాఠం చెప్పాలి.. అలా అలా – "రెండైపోతుందేమో మధ్యాహ్నం వొచ్చేసరికి" అన్నాడు.

"ఇల్లెక్కడ తీసుకున్నావునాన్నా?"

"ఆ సమస్య లేదమ్మా. ఇంతకు ముందుండిన డిప్యూటీ డైరక్టరు రాజగోపాల్ కిచ్చిన రెంటు కంట్రోలు బిల్డింగే సరాసరి నాకు ఎలాట్ అయింది."

"ఇక్కడికొచ్చి నాన్నా."

రాఘవయ్య నవ్వేడు. "మీరే అక్కడికొచ్చెయ్యండి. ... ఎంత పెద్ద ఇల్లో తెలుసా? ఎనిమిది గదులు; ఓ ఇరవై కుర్చీలు వేసి మీటింగు పెట్టుకోడానికి చాలినంత! ఈ రూమంత బాత్రూము; ఈ రెండు గదులూ కలిపినంత వంటిల్లు! పెరట్లో వేపచెట్టు. వీధి వేపు సంపెంగచెట్టు. నాలుగు కొబ్బరిచెట్లున్నాయి. కొళాయుంది. నుయ్యుంది. హాయిగా ఉంటుంది. ఎందరున్నా, ఇంకెందరొచ్చినా సరేను."

తండ్రి ధోరణి మారినందుకు ఆనందంగానే ఉన్నా ఆనాడు పెళ్ళి రిజస్టరు అవబోతున్న సమయంలో ఆయన ప్రభాకరాన్ని అన్న మాటలు ఇంకా చెవుల్లో రింగుమంటూనే ఉన్నాయి. అతని తిట్టాడు. అతని కులాన్ని తిటాడు. తనని తిట్టేడు సరే; తల్లిని కూడా దుర్భాషలాడేడు.

"నువ్వు దిక్కూమొక్కూలేందాన్లా రెక్కలు ముక్కలు చేసుకుని పదిమంది పరాయివాళ్ళ మధ్య ఒళ్ళొంచి పని చెయ్యడం తల్చుకుంటే నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించమ్మా. మీరిద్దరూ అక్కడి కొచ్చెయ్యండి. నువ్వు ఉద్యోగం మానేసి నాకూ అతనికీ వేళకింత అన్నం పెట్టు. ఆవేళ కోపంలో నేనన్న మాటలు మరిచిపోయి, నీకో కొడుకు పుట్టేదాకా నేనే నీకొడుకుననుకో." అని కూతురి చేతులు పట్టుకున్నాడు రాఘవయ్య.

* * *

"చాలా స్వతంత్రుడు సార్, ఆ యబ్బాయి!" అని, షిప్పింగ్ కంపెనీ మేనేజరు అప్పారావు హైద్రాబాదునుంచి తనతో బాటు రైల్లో వస్తూ ప్రభాకరం గురించి అన్న మాటల్ని పట్టించుకోలేదు. రాఘవయ్య.

"స్వతంత్రుడన్నమాట నిజమే కావచ్చుగాని; నేను అమ్మాయితోనే చెప్పినా నాతో ఒక ఇంట్లోవుండడానికొచ్చేశాడు కదా అంటే, అమ్మాయి దగ్గిర అస్వతంత్రుడా? అలా అయితే మరీ మంచిదీ?" అనుకున్నాడు.

"పైగా, ఇంటికి వెంటికీ అవసరమైన సామగ్రి కొనుక్కోమని పదిహేను వేలిస్తే తలవూపుతూ అందుకున్నాడే!"

ఈపాటికి నేను చెప్పినట్లుగా స్టీలు మంచాలూ, ఫోమ్ బెడ్లు రిఫ్రిజిరేటరు స్టీలు బీరువా, దాన్లో దాచుకుందికి విలువయిన వస్త్రాలు - కొనుక్కునే ఉంటారు - అనుకుంటూ రైలుస్టేషన్ నుంచి ఇంటికి ఉత్సాహంగా జీపులోనే ఉన్నా మరింత వేగంగా వొచ్చేశాడు. "పదిహేను వేలిచ్చాను. సరిపోయాయో లేదో?" అని దిగులు పడ్డాడు.

గేటు తెరవగానే రాఘవయ్య దృష్టి సంపెంగ చెట్టుమీద పడ్డాది. "అదుగో, పూత!"

గుమ్మంలో అలికిడి విని పలినించి వొచ్చింది రత్నం. నైలెక్స్ కాదగాని ఏదో మంచి చేరే కట్టుకుంది. సంపెంగపువ్వు రంగు. నాచిట్టి తల్లికి చక్కగా అమరింది.

గదిలోకొచ్చి బూట్లు విప్పాడు.... స్టీలు మంచాలూ ఫోమ్‌బెడ్లు కాదుగాని సౌఖ్యంగా ఉండేటట్లే ఉన్నాయి. "బావున్నాయి, ట్విన్ కాట్స్" అన్నాడు అల్లుడితో.

"అవునండీ, నాస్టూడెంట్స్‌లో ఓ ముగ్గురు; నా టీచింగు విధానం గురించి వాళ్ల తల్లిదండ్రులకి చెప్పి బహుమతిగా ఇప్పించేరు". అన్నాడతను; విలాసహాసంతో

"నాకు బోనస్ అందిందినాన్నా" అంది రత్నం; చేతికి పెట్టుకున్న గడియారం చూపించి.

"సంతోషం తల్లీ! చూసేవా, మన సంపెంగచెట్టు మానింది ...అబ్బ! వెయ్యిబకెట్లకి పైగా నుతిలోంచి తోడిపోశాను నీళ్లు-ఊరికే పోతుందా?"


ప్రభాకరం నవ్వేడు. "మీరెళ్లిన రాత్రి ఓ గంటసేపు వర్షం పడ్డందువల్ల చెట్టుకి ఆ పులకరింత. అంతేగాని మీ వెయ్యి బకెట్ల నీళ్లక్కాదు!"

రిస్టువాచీ విప్పి టేబిల్ మీద పెడుతూఉంటే తన బ్యాంక్ పాస్‌బుక్కు కనబడింది అక్కడ, రాఘవయ్యకి. "ఇదిక్కడెందుకుంది?" అని తిరగేశాడు.

నాలుగురోజుల కిందటి తేదీతో పదిహేను వేల రూపాయల జమ ఉంది అందులో.

(మిత్రుడు సంకుపాపారావు జ్ఞాపకార్థం)

# కౌంట్ డౌన్



- అమ్మంగి వేణుగోపాల్

కౌంట్‌డౌన్ మొదలైంది! కొండలను మంచుఖండాలను
అడవులను మైదానాలను అగాధాలను నదీనదాలను దాటుతూ
ప్రయాణం! నేలతల్లి నల్లపూసగా మారే దూరాల్లోకి
మహాసముద్రాలు చెమటచుక్కగా మారే దూరాల్లోకి
ప్రయాణం! రాకెట్లో ప్రయాణం!! కొత్త రేఖాంశాల్ని కొలుస్తూ
కొత్త అక్షాంశాల్ని మలుస్తూ కాంతి సంవత్సరాల క్యాలెండర్ కాగితాల్ని చించేస్తూ
ఇక్కడ క్షణాల మధ్య అనంత దూరం మనిషి ప్రయాణం
ఇది నక్షత్రాల కాంతి తీరం వైర్లెస్ యంత్రాల్లోంచి తీగలు సాగే విజ్ఞానం
భూమి ఆకర్షణల్ని తప్పించుకున్న విజ్ఞానం
గోళాల్ని గ్లోబులుగా మార్చిన విజ్ఞానం అణుకంప్యూటర్ మెదడులో దూరి
మీటలుగా మారి మనిషి ఆజ్ఞల్ని అమలు చేస్తోంది
ప్రయోగాల వెనుక దాగివున్న విజయాలను వెతుక్కుంటూ
కలల్లో కనిపించిన స్వర్గజలపాతాలను వెతుక్కుంటూ
లక్ష్యంవైపు సాగుతున్నాడు మనిషి
ఇంతలో. హఠాత్తుగా లక్ష నక్షత్రాలు ఏకమైనట్లు కోటి
పిడుగులు సంఘర్షించినట్లు ప్రళయకాంతి!, మృత్యుగర్జ!!
రోదసిలో యుద్ధరాక్షసి అడుగుపెట్టింది.
అణ్వస్త్ర పరీక్షల్లో ఆకాశం కొంగు అంటుకుంది.
అక్కడ ఎవరో ఉరితాళ్ళతో జెండాల్ని ఎగరవేశారు
అక్కడ ఎవరో పాతరాతియుగాన్ని మళ్ళీ సృష్టించారు
కాంతిగోళాల నడుమ చీకటి సంవత్సరకాల శకం
మొదలైంది! పాపం మనిషి
అదిగో పిచ్చెత్తిన రాకెట్‌లో తిరుగుతున్నాడు
స్పృహ తప్పిన మీటలమధ్య నలుగుతున్నాడు
ఊపిరి కోల్పోయిన ఆక్సిజన్ సిలెండర్ల నడుమ పడిపోయాడు
కాపాడండి వాణ్ణి గ్రహాల చిన్నతమ్ముణ్ణి త్రిశంకు విజ్ఞానానికి బలైపోతున్న వాణ్ణి
అమాయకుడు వాడు అసహాయుడు వాడు వాణ్ణి అమరుణ్ణి చేయకండి
మనిషిని మనిషిగా బతకనీయండి చాలు